సాక్షి వనపర్తి

మంగళవారం ၊ 18 ၊ ఏప్రిల్ ၊ 2023



రాజ్యాధికారంతోనే..

రాజ్యాధికాంతోనే హక్కులు సాధించుకోగ లమని ప్రజా గాయకుడు గద్దర్ అన్నారు.

వివరాలు 10లో ▸



దేశ సంపదను దోచిపెడుతూ..

దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని నారాయణ అన్నారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.0 /26.5

రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం ఆకాశం తేలికపాటి మేఘావృతమవుతుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-39 (మంగళవారం సాయంత్రం)

సహర్ 4-36 (బుధవారం తెల్లవారుజామున)

లక్ష్యం.. చేరేనా?

భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా 'అమృత్ సరోవర్' పథకం కింద పనులు



శ్రీరంగాపూర్ మండలం శేరపల్లిలో అమృత్ సరోవర్ పథకం కింద కుంట పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

- కొత్త చెరువులు.. కుంటల తవ్వకం, మరమ్మతు
- జూలై నాటికి వంద చెరువుల్లో పనులు చేపట్టాలని ప్రణాళిక
- జిల్లాలో 75 పనులకు ఇప్పటివరకు 20 మాత్రమే పూర్తి

పెబ్బేరు: పల్లెల్లో నీటి ఎద్దడిని తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ సరోవర్ పథకం అమలులోకి తెస్తూ నీటి వనరులను అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా కుంటలు, చెరువుల మరమ్మతులతో పాటు కొత్త నిర్మాణాలను చేపడుతున్నారు. జాతీయ ఉపాధిహామీలో వీటిని చేర్చడం వల్ల కూలీలకు ఉపాధి లభిస్తోంది. గ్రామాల్లో భూగర్భ జలాల పెంపునకు ఇవి ఎంతో దోహదపడుతుండటంతో బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయి. అయితే, ఈ ఏడాది 75 చెరువులు, కుంటల పనులు చేయాలని లక్ష్యంగా ఉండగా.. ఇప్పటికీ 20 పనులు మాత్రమే పూర్తయ్యాయి. మరో మూడు నెలల్లో లక్ష్యాన్ని పూర్తి చేసేలా అధికారులు ముందుకెళ్తున్నారు.

కుంట నిర్మాణానికి రూ.10 లక్షలు

అమృత్ సరోవర్ పథకంలో భాగంగా జిల్లాలో కుంటల మరమ్మతుకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులకు ఎకరా భూమి ఉంటే కొత్తగా కుంట నిర్మాణం చేయవచ్చు. వీటికి గరిష్ఠంగా రూ. 10 లక్షలు నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టే వీలుంటుంది. అలాగే మరమ్మతులలో ఎలాంటి యంత్రాలు వినియోగించకుండా ఒక్కో చోట సుమారు వంద మంది కూలీలతో పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఎంపిక చేసిన కుంటల్లో 10 వేల ఘనపు అడుగుల మేర మట్టి పూడిక తీయనున్నారు. కరకట్ట బలంగా ఉండేందుకు పూడిక తీతలో వచ్చే మట్టిని పోయాల్సి ఉంటుంది. వర్షాకాలంలో వరదనీరు కుంటల్లోకి చేరి సత్ఫలితాలిస్తాయి. ఈ ప్రాంతంలో బోరు బావులే ఆధారం భూగర్భ జలాలు వృద్ధి చెందేందుకు కుంటలు దోహద పడతాయి. పశువులు, గొర్రెలు, మేకలు, వణ్యప్రాణులు, పక్షులు దాహార్తి తీర్చుకునేందుకు ప్రయోజనకరంగా వీలిని తీర్చి దిద్దనున్నారు.

రైతులకు ఎంతో ప్రయోజనం



రైతులకు, కూలీలకు అమృత్ సరోవర్ పథకం ఎంతో మేలు చేస్తుంది. ఏళ్ల తరబడిగా పూడిక తీయని చెరువులు, కుంటల్ని ఈ పథకంలో ఎంపిక చేశాం. కొత్తగా 18 కుంటల్ని తవ్వడం వల్ల భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి వర్షాకలంలో నీటిని ఒడిసిపట్టేలా లక్ష్యంగా పెట్టుకున్నాం.

– నరసింహులు, డీఆర్‌డీఓ

20 పనులు పూర్తి..

జిల్లాలో 14 మండలాల్లో గతేడాది 75 చెరువులు, కుంటల మరమ్మతులను మిషన్ అమృత్ సరోవర్‌లో గర్తుంచి పనులు కొనసాగించారు. వీటిలో 18 కొత్త చెరువుల తవ్వకం, 57 పాత చెరువుల పునరుద్ధరణ, పూడిక తొలగింపు వంటి పనులు చేపట్టారు. ఒక్కో పనికి సుమారు రూ.7 లక్షలు కేటాయించారు. వీటిలో 70 పనులకు పరిపాలనాపరమైన అనుమతులు తీసుకోగా ఇప్పటి వరకు 20 పనులు పూర్తయ్యాయి. వర్షాలు కురిసే సమయానికి వీలైనంత త్వరగా వీటిని పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఇదిలాఉండగా, మొత్తం 75 పనులు చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు లక్ష్యం పూర్తి కాకపోవడంతో జూలై నాటికైనా లక్ష్యాన్ని చేరుకోవాలని ఆ మేరకు పనులు వేగవంతం చేశారు. జూరాల పరివాహక ప్రాంతం కావడం, జిల్లాలో సాగునీటి వనరులు మెరుగ్గా ఉండడంతో రైతులు కుంటల తవ్వకానికి ఆసక్తి చూపకపోవడం, పనుల గుర్తింపు సమస్యగా మారింది. దీంతో పాత చెరువుల మరమ్మతులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి.

న్యూస్‌రీల్

ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

వనపర్తి: సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో దాఖలు చేసిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయనతోపాటు అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, ఆర్డీఓ పద్మావతి, డీఆర్‌డీఓ నర్సింహ్ములు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దాఖలైన అర్జీల్లో ఎక్కువగా భూములకు సంబంధించిన సర్వే కోసం దరఖాస్తు చేసి సర్వే చేయటం లేదనే అర్జీలే రావటంతో కలెక్టర్ సర్వే డిపార్టుమెంట్ ఏడీ బాలక్రిష్ణపై అసహనం వ్యక్తం చేశారు. రెండేళ్లుగా సర్వే చేయటం లేదని ఓ మహిళ కలెక్టర్‌కు సమస్యను వివరించగానే ఆయన స్పందిస్తూ.. సర్వే కోసం చేసిన అర్జీలు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయానే అంశంపై త్వరలో సమీక్ష నిర్వహిద్దామని, జిల్లాలోని అన్ని మండలాల సర్వేయర్లతో ఈ విషయంపై సమీక్షిస్తానని చెప్పారు. మొత్తం 52 అర్జీలు దాఖలైనట్లు గ్రీవెన్స్‌సెల్ అధికారి శ్రీకాంత్‌రావు తెలిపారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 10 అర్జీలు



వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 10 ఫిర్యాదులు వచ్చాయి. ఆయా మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు ప్రజావా ణిలో ఏఎస్పీ షాకీర్ హుస్సేన్‌కు వినతులు సమర్పించారు. భూ తగాదాలు, భార్య భర్తల ఫి ర్యా దులు, పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యా దులు ప్రజావాణికి వచ్చాయని, పెండింగ్ లేకుండా వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులను ఏఎస్పీ ఆదేశించారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి



కొత్తకోట: సీఎం కేసీఆర్ పరిపాలన దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని, ముస్లింల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని దేవరక ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గిఫ్ట్ ప్యాక్‌ల (రంజాన్ తోఫా) పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలో నిర్వహించగా.. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై రంజాన్ తోఫాలను పేదల ముస్లింలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల పండుగలను ఘనంగా జరుపుకొనేందుకు ఏటా నిధులు కేటాయిస్తుందని చెప్పారు. బతకమ్మ పండుగకు చీరలు, క్రిస్మస్, రంజాన్ పర్వదినాల్లో పేదలకు దుస్తులు అందజేసి పండుగలను సంతోషంగా జరుపుకొనేలా చేస్తుందన్నారు. ప్రస్తుతం పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పేద ముస్లిం కుటుంబాలకు అందజేసేందుకు బీఆర్‌ఎస్ సర్కార్ గిఫ్ట్ ప్యాకులను అందజేస్తున్నట్లు చెప్పారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఎన్ని వనరులు ఉన్నా కోట్లాది మంది ఇబ్బందులు పడుతున్నారని భావించిన సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో విజయంతో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ సాధిస్తుందన్నారు. ఎంపీపీ గుంత మౌనిక, మున్సిపల్ చైర్మన్ సుఖేశిని, జెడ్పీటీసీ మాజీ సభ్యులు విశ్వేశ్వర్, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, కౌన్సిలర్లు ఖాజమైనోద్దీన్, రాములు, రామ్మోహన్‌రెడ్డి, పద్మ, నాయకులు బాలనారాయణ, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా చేపట్టాలి

- అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు
- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

వనపర్తి: జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ నిబంధనల ప్రకారం సజావుగా సాగాలని.. ఎక్కడైనా అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ స్పష్టం చేశారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఏఈఓలు రైతులకు టోకెన్లు జారీ చేయాలని, ఇందుకు సంబంధించి డీఏఓ వీడియో కాన్ఫరెన్స్‌లో అందరికి సూచనలివ్వాలన్నారు. కోతలు ప్రారంభించే ప్రాంతాలకు తేమశాతం కొలిచే మిషన్లు, ఎలక్ట్రానిక్ కాంటాల సరఫరా చేయాలన్నారు. ధాన్యం లేకుండానే ట్రక్‌షీట్లు రాస్తే.. సహించేదిలేదన్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పద్ధతి ప్రకారం చేయాలని తూకాల మిషన్లను తూనికలు, కొలతల అధికారులతో స్టాంపింగ్ చేయించాలని మార్కెటింగ్ శాఖ అధికారి స్వరణ్‌సింగ్‌కు సూచించారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

ఆధార్ తీసుకొని పదేళ్లు దాటిన వారు తప్పనిసరిగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని కలెక్టర్ చెప్పారు. సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఈ విషయంపై డిస్ట్రిక్ట్ లెవెల్ ఆధార్ మానిటరింగ్ కమిటీ, మీసేవ సెంటర్ల ఆపరేటర్లు, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనల ప్రకారం పౌరులందరికీ.. ఆధార్ కార్డు ఉండాలని, పేరులో మార్పు చేయాలన్న, పుట్టిన తేదీ మార్చాలన్న జెండర్ (లింగం) తప్పుగా నమోదైతే మార్చుకోవాలన్నా వెంటనే మార్చుకోవాలన్నారు. ఈ విషయంపై అధికారులు ఆధార్ అప్‌డేట్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. ఆధార్ కార్డు పేరుతో చేసే మార్పులతో మోసాలను అరి కట్టేందుకు యూఐడీఏఐ జారీ చేసిన ఆదేశాలను ఆధార్ కేంద్రాల వారు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆధార్ కార్డులో సవరణలు చేసుకునే వారి వయస్సును బట్టి మూడు కేటగిరీలుగా విభజించారని, 0–5. సంవత్సరాల వయస్సు గల పిల్లలకు మొదటి క్యాటగిరి, 18 సం. లోపు వారిని రెండో క్యాటగిరి, 18 సం పై బడిన వారిని మూడో క్యాటగిరిగా చేసారని, మూడు రకాల దరఖాస్తు పత్రాలను సిద్ధం చేశారని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధరల పట్టికను తెలుగులో ప్రదర్శించాలని ఆదేశించారు. ఆధార్ నమోదు కోసం బర్త్ సర్టిఫికేట్, పాన్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ ఐడి, బ్యాంకు పాస్ పుస్తకం ఏదైనా ఐడి ప్రూఫ్‌తో అప్డేట్ చేసుకోవాలన్నారు. మొబైల్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలని, మున్సిపల్ కమీషనర్, తహసీల్దార్ జారీ చేసిన గుర్తింపు పత్రాలను చూపాలన్నారు. తహసీల్దార్లు చెక్ లిస్ట్ ప్రకారం ఆధార్ సెంటర్లను తనిఖీ చేయాలని, నకిలీ ధ్రువపత్రాలు ఉంటే క్రిమినల్ కేసులు బుక్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వెరిఫికేషన్ చేయాలన్నారు. ఆధార్ సెంటర్లను ఆదివారం కూడా పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్,ఆర్డీఓ పద్మావతి పాల్గొన్నారు.



హాజరైన ఆయాశాఖల జిల్లాస్థాయి అధికారులు

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్

పెబ్బేరు: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అదానీ, అంబానీ కార్పొరేట్ కంపెనీలకు అప్పనప్పంగా కట్టబెడుతున్నారని.. ప్రజలంతా ఏకమై ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. సోమవారం పట్టణంలోని హమాలీ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలన్నారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేట్ కంపెనీలకు అప్పజెబుతున్నారని ఇది సరైన పద్ధతి కాందన్నారు. అలాగే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎంపీటీసీ బాలయ్య అధ్యక్షతన కార్యక్రమం కొనసాగగా.. నాయకులు బాల్‌రెడ్డి, మండ్ల రాజు, నాయకులు పెద్ద ఖాజా, భాస్కర్, ఖాజా హుస్సేన్, రవి, ఊషన్న, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే చైతన్యం



మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్: విద్యతోనే చైతన్యవంతమైన సమాజ నిర్మాణం రూపుదిద్దుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ రంగంలో విద్యా ప్రమాణాలు, వసతులు పెంచేందుకు మన ఊరు–మన బడి కార్యక్రమంతో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. పోటీ ప్రపంచాన్ని తట్టుకొని నిలబడేలా పాఠ్యాంశాలతో పాటుగా సమకాలీన అంశాలను మేళవించి విద్యార్థులకు విద్యనందించాలన్నారు. విద్యార్థులు ఎక్కడ చదివిన కృషి, పట్టుదల, ఏకాగ్రత, ప్రణాళిక ఉంటేనే జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరని సూచించారు. అంతకుముందు విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పుర చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, పాఠశాల డైరెక్టర్ రామానాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ కూలీలు

పెబ్బేరు రూరల్: ఉపాధిహామీ కూలీల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లిలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు తీవ్రంగా ఉండంతో కూలీలకు ఉపాధి పనులు చేసే ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. రోజు వారీగా రూ.120 నుంచి రూ.150 వేతనం మాత్రమే వస్తున్నాయని, రోజు రోజుకు నిత్యావసరాల ధరలు పెరుగుతుండడంతో కొలతల పని కాకుండా కనీస వేతనం రూ.600 వచ్చేలా పనులు చూపించాలన్నారు. వ్యవసాయంలో యంత్రాలు రావడం వలన కూలీలకు పని దినాలు తగ్గిపోతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని 100 నుంచి 200 రోజులకు పనిదినాలు కల్పించి, గతంలో మాదిరిగా వారికి వ్యవసాయ పరికరాలు ఇవ్వాలని ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లక్ష్మన్‌గౌడ్, పురుషోత్తం, బాలనాగన్న తదితరులు పాల్గొన్నారు.

అక్రమాల్లో కీలకం..!

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులదే ముఖ్య భూమిక

- ఉమ్మడి పాలమూరు జిల్లాలో వారిదే ఆధిపత్యం
- వారి చేతుల్లోనే డిజిటల్ కీ..
- అధికారులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లేకపోవడమే కారణం
- ప్రధానంగా రెవెన్యూ, మున్సిపల్, రిజిస్ట్రేషన్ శాఖల్లో అవకతవకలు
- పలు చోట్ల రెగ్యులర్ ఉద్యోగులపై వారిదే పెత్తనం



➪ మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామ శివారులోని ఓ భూమికి సంబంధించి ఒకరు ఫోర్జరీ చేసిన ఆధార్ కార్డుతో ఈ కేవైసీకి దరఖాస్తు చేసుకున్నారు. దీనికి క్లియరెన్స్ ఇవ్వగా, దుమారం చెలరేగింది. విచారణ చేపట్టగా.. కలెక్టరేట్‌లో ధరణి ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అని తేలడంతో అప్పటి కలెక్టర్ అతడిని విధుల నుంచి తొలగించారు.

➪ నారాయణపేట జిల్లాలో బీమా ప్రాజెక్ట్‌లో భాగంగా మెయిన్ కెనాల్ భూసేకరణలో రూ.3.50 కోట్ల కుంభకోణానికి సంబంధించి ముగ్గురు ఆపరేటర్లపై వేటు పడింది.

.. ఇలా వేటు పడిన వారు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారందరూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులే. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల్లో పలు ప్రభుత్వ శాఖల కార్యకలాపాల్లో వారే కీలక పాత్ర పోషిస్తున్నారు. వివిధ విభాగాల అధిపతులతో పాటు రెగ్యులర్ ఉద్యోగులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కొరవడడంతో వారి హవానే కొనసాగుతోంది. డిజిటల్ వ్యవహారాలకు సంబంధించిన 'కీ'లక బాధ్యతలను సైతం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకే వదిలిపెట్టడంతో అక్రమాలు చోటుచేసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లోని పలు ప్రభుత్వ శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. ప్రధానంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, వైద్యారోగ్యం, విద్య, మున్సిపల్ తదితరశాఖల్లో వారిదే ఆధిపత్యం. రెవెన్యూ శాఖలో తహసీల్దార్ కార్యాలయాల నుంచి మొదలుకుని కలెక్టరేట్ వరకు ధరణి ఆపరేటర్లుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో భూ రికార్డులకు సంబంధించిన వ్యవహారాలన్నీ వారి ఆధీనంలోనే ఉంటున్నాయి. ఈ క్రమంలో పలు చోట్ల ధరణి ఆపరేటర్లు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సుమారు సంవత్సరం క్రితం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ధరణి ఆపరేటర్‌గా ఉన్న ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అక్రమాలకు పాల్పడడంతో అతడిపై వేటు వేయడం ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది. మరోవైపు రెవెన్యూతో పాటు రిజిస్ట్రేషన్, మున్సిపల్ శాఖల్లోని కొందరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మండల, జిల్లాస్థాయి అధికారుల మాటలను సైతం ఖాతరు చేయడం లేదనే గుసగుసలు ప్రభుత్వ ఉద్యోగ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

కొన్ని ఉదాహరణలు..

- జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలో ధరణి ఆపరేటర్ మహేష్‌పై వేటు వేశారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారనే కేసులో అతడిని విధుల నుంచి తొలగించారు.
- గద్వాల కలెక్టరేట్‌లో ధరణిలో విధులు నిర్వర్తించే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అక్రమాలకు పాల్పడడంతో వేటు వేశారు.
- నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో ధరణిలో తహసీల్దార్ లాగిన్‌లోకి వెళ్లి అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో ఆపరేటర్‌పై వేటు పడింది.
- వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం రెవెన్యూ కార్యాలయంలో ఒకరిపై వేటు పడింది.
- పెబ్బేరులో మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఎంఈఓ లాగిన్ ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాల వారీగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు..

జిల్లా	ఉద్యోగులు
మహబూబ్‌నగర్	1,329
నాగర్‌కర్నూల్	486
వనపర్తి	339
నారాయణపేట	319
జోగుళాంబ గద్వాల	307
మొత్తం	2,780

డిజిటల్ 'కీ' సైతం..

ప్రభుత్వ శాఖల కార్యకలాపాలు దాదాపుగా డిజిటల్ పద్ధతిలోనే జరుగుతున్నాయి. అధికారి మాత్రమే డిజిటల్ 'కీ' ద్వారా లాగిన్‌లోకి వెళ్లి నమోదు, క్లియరెన్స్ చేయడం వంటివి చేయాలి. కానీ పనిభారం, ఇతరత్రా కార్యక్రమాలతో ఆపరేటర్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో కొందరు డిజిటల్ 'కీ'ని అవకాశంగా మలుచుకుని అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రికార్డులను తారుమారు చేస్తున్నారనే ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. అంతేకాకుండా కొన్ని ప్రభుత్వ శాఖల్లో ఔట్ సోర్సింగ్ సిబ్బందిదే ఆధిపత్యం నడుస్తుండగా.. ప్రభుత్వ ఉద్యోగులు డమ్మీలుగా మారారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అవకతవకలకు అడ్డుకట్ట పడేదెలా..

ఏదైనా తప్పు చేస్తే మెమో వస్తుందో.. సాలరీ కట్ అవుతుందో.. ఉద్యోగం ఊడుతుందోననే భయం రెగ్యులర్ ఉద్యోగుల్లో ఉంటుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే వారు నడుచుకునే అవకాశం ఉంటుంది. అయితే వారికి కంప్యూటర్ పరిజ్ఞానం, సాంకేతికతపై అవగాహన లేకపోవడం .. కొత్త రిక్రూట్‌మెంట్ అంతంతమాత్రంగానే జరుగుతుండడంతో విధిలేక ఔట్ సోర్సింగ్ ఏజన్సీల ద్వారా సిబ్బందిని విధుల్లోకి తీసుకోక తప్పని పరిస్థితులు ఆయా ప్రభుత్వ శాఖల్లో నెలకొన్నాయి. మరోవైపు ఉద్యోగం ఎన్నాళ్లు ఉంటుందో తెలియదు.. ఎంత చేసినా జీతం పెరిగేది లేదు.. జాబ్ రెగ్యులర్ చేస్తారనేది అనుమానమేనని భావిస్తున్న కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అవకాశం దొరికినప్పుడల్లా డబ్బులు దండుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రెగ్యులర్ ఉద్యోగులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన కల్పించేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి.. వారికే బాధ్యతలు అప్పగిస్తే అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

గుండెపోటుతో యువకుడి మృతి

- వైద్యుడి నిర్లక్ష్యంపై బాధిత కుటుంబీకుల ఆందోళన



రాజు(ఫైల్)

అచ్చంపేట రూరల్: డాక్టర్ నిర్లక్ష్యంతోనే యువకుడు మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు హాస్పిటల్ ఎదుట ఆందోళన చేసిన సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బల్మూర్ మండలం కొండనాగులకు చెందిన చింతల రాజు(26)కు ఛాతిలో నొప్పిగా ఉండడంతో సోమవారం మధ్యాహ్నం అచ్చంపేటలోని భవానీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. రాజును పరీక్షించిన డాక్టర్ ప్రశాంత్‌నాయక్ గ్యాస్ట్రబుల్ సమస్య అని టాబ్లెట్స్ రాసి పంపాడు. తిరిగి కొండనాగులకు వెళ్లిన రాజుకు నొప్పి అధికం కావడంతో కుటుంబ సభ్యులు తిరిగి అదే ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యుడు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్నాడని తెలుపడంతో అక్కడికి వెళ్లే సమయానికే రాజు ఆస్పత్రి గేటు ఎదుటే మృతిచెందాడు. వైద్యుడి నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ భవానీ ఆస్పత్రి ఎదుట బాధిత కుటుంబీకులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారిని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా, గత 15రోజుల కిందట డాక్టర్ నిర్లక్ష్యంతో శిశువు మృతిచెందిన సంఘటన మరువక ముందే మరో ఘటన జరుగడం చర్చనీయాంశంగా మారింది.

చెరువులో పడి వ్యక్తి..

దేవరకద్ర: పశువులకు నీరు తాగించడానికి చెరువు వద్దకు వెళ్లిన ఓ వ్యక్తి మూర్ఛ వ్యాధి వచ్చి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బల్సుపల్లికి చెందిన లాల్‌కోట నారాయణ(60) ఆదివారం పాడి గేదెలను తీసుకుని సమీపంలో ఉన్న చెరువు వద్దకు మేపడానికి వెళ్లాడు. గేదెలకు నీటిని తాపడానికి చెరువులోకి తీసుకెళ్లాడు. అదే సమయంలో మూర్ఛ వచ్చి నారాయణ ప్రమాదావశాత్తు చెరువు నీటిలో పడి మృతిచెందాడు. సోమవారం చెరువులో నుంచి శవాన్ని వెలికి తీసి పోస్టుమార్టానికి తరలించారు. మృతుడి భార్య అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం



శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల గ్రామ శివారులో చేతికి వచ్చిన మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతి అయ్యింది. అయిజ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు కె.ఈరన్న మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశాడు. రెండు రోజుల్లో పంట కోద్దామని ప్రయత్నిస్తుండగా సోమవారం ప్రమాదవశాత్తు పంటకు నిప్పంటుకుని మూడెకరాల్లోని మొక్కజొన్న కంకులు కాలి బూడిదయ్యాయి. దీంతో రూ.4 లక్షల పంట నష్టపోయినట్లు బాధిత రైతు తెలిపారు. ప్రభుత్వపరంగా ఆర్థికసాయం అందించి ఈరన్న కుటుంబాన్ని ఆదుకోవాలని తోటి రైతులు కోరారు.

ఇసుక ఫిల్టర్ల ధ్వంసం

మహమ్మదాబాద్: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇసుక ఫిల్టర్లను అధికారులు ధ్వంసం చేశారు. వివరాల్లోకి వెళితే.. మహమ్మదాబాద్ మండలంలోని అన్నారెడ్డిపల్లి వద్ద కొంతకాలంగా ఇసుక ఫిల్టర్లను అక్రమంగా నిర్వహిస్తున్నారు. ఫిల్టర్ చేసిన ఇసుకను వివిధ గ్రామాలకు అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో సోమవారం రెవెన్యూ అధికారులు వాటిని ధ్వంసం చేశారు. ఆర్‌ఐ యాదయ్య ఫిల్టర్లు నిర్వహిస్తున్న చోటికి చేరుకొని జేసీబీతో ధ్వంసం చేయించారు. ఎక్కడ ఇసుక ఫిల్టర్లు నిర్వహించినా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుక్కల వీరంగం



కుక్కకాటుకు గురైన వెంకటయ్య

అమరచింత: పట్టణంలో ఊరకుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మటన్ మార్కెట్‌లో కుక్కలు ఎక్కువగా ఉండటంతో ఆ దారిలో వెళ్లేందుకు జనాలు ఇబ్బందిపడుతున్నారు. దారిలో వెళ్తున్న వారిని కుక్కలు వెంబడిస్తున్నాయి. ఈ క్రమంలోనే సోమవారం మటన్ మార్కెట్ రహదారిలో ఓ దుకాణ వ్యాపారి కుమ్మరి వెంకటయ్యపై కుక్కలు దాడి చేశాయి. స్థానికులు ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వార్డులోనే ఈ పరిస్థితి ఉందని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమదందాకు నీళ్లు.. పంట పొలాలు బీళ్లు





మాచన్‌పల్లిలో కృత్రిమ ఇసుక తయారీకి నీళ్లు, పక్కనే నీళ్లు లేక నెర్రలు బారిన వరి పొలం

- ప్రశ్నించే రైతులపై భౌతికదాడులు
- మాముళ్ల మత్తులో అధికార యంత్రాంగం
- రెచ్చిపోతున్న ఫిల్టర్ ఇసుక మాఫియా
- మాచన్‌పల్లి, కోటకదిరలో రాంత్రిబవళ్లు ఇదే దందా

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో చుట్టుపక్కల గ్రామాలు అక్రమార్కుల కారణంగా వళ్లకాడ్లుగా మారాయి. పదేళ్ల నుంచి నుంచి సొంత భూములు కలిగి ఉన్న వ్యక్తులతో పాటు ఎలాంటి భూములు లేని వారు కూడా తోడై అక్రమ ఫిల్టర్ ఇసుక వ్యాపారానికి తెగబడ్డారు. మా పొలంలో నుంచి టిప్పర్లు, ట్రాక్టర్లు తీసుకెళ్లకండి అంటూ.. రైతులు ప్రాధేయ పడుతున్నా కనికరం చూపని ఇసుక మాఫియా భౌతిక దాడులకు దిగుతుండటం విచారకరం.

నీళ్ల దారి మళ్లింపు..

రైతుల పంట పొలాలకు అందాల్సిన నీళ్ల అక్రమ ఇసుక తయారీదారులు దారి మళ్లించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మాచన్‌పల్లి, కోటకదిర, కోడూర్, ఓబ్లాయిపల్లిలో విచ్చలవిడిగా వ్యాపారం సాగిస్తున్న అక్రమార్కులు మన్యంకొండ గుట్టపై ఉన్న మిషన్ భగీరథ వృథా నీటిని తమ వ్యాపారానికి వినియోగించుకుంటున్నారు. ఈ వ్యాపారానికి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత కరెంట్ కూడా ఉపయోగపడుతుంది. భూములు ఎవరివైనప్పటికి పెద్ద పెద్ద గోతులు తవ్వి మన్యంకొండ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (డబ్ల్యూటీపీ) నుంచి వస్తున్న వృథా నీటిని వనరుగా ఏర్పాటు చేసుకుని చెరువులను తలపించే విధంగా నీటిని నిల్వ చేసుకుంటున్నారు. మట్టిని కడిగి కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నారు. ఇక్కడ ఇసుక తయారీకి కావల్సినంత నీరు అందుతుండగా కొద్ది దూరంలోనే ఉన్న పంట పొలాలు మాత్రం బీళ్లుగా కనిపిస్తున్నాయి. వ్యాపారుల ఆగడాలతో భూగర్భ జలాలు ఇంకిపోయి రైతులకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది. వీటితోపాటు వెంకటాపూర్, రేగడిగడ్డతండా, మాచన్‌పల్లితండా, లాల్యానాయక్‌తండా, జైనల్లీపూర్, రామచంద్రాపూర్, జమిస్తాపూర్‌లో ఇలాంటి వ్యాపార నిర్వహిస్తున్న అక్రమార్కులు రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. తమకు వచ్చిన ఆదాయంలో పోలీస్, రెవెన్యూ అధికారులకు మాముళ్లు ఇస్తుండటం వల్ల ఈ వ్యవహారం బయటకు పొక్కడం లేదు.

రూ.లక్షల్లో వ్యాపారం

రాత్రింబవళ్లు తేడా లేకుండా ఫిల్టర్ ఇసుక తయారు చేసి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా విక్రయించడంతో రూ. లక్షల్లో వ్యాపారం సాగుతుంది. బడా నేతలకు భజనపరులు అయిన కొంతమంది మండల స్థాయి నాయకులు ఫిల్టర్ ఇసుక తయారీదారులతో చేతులు కలిపి మీ వెంట మేమున్నామంటూ భరోసా కల్పించడంతో ఈ అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది.



మాచన్‌పల్లి శివారులో ఫిల్టర్ ఇసుక తయారీ

తాజాగా.. కోటకదిరలో రైతు కంతి ఖాదరయ్య పొలం గుండా ఫిల్టర్ ఇసుక బండ్లు పోతుంటే అడ్డు చెప్పబోయాడు. దీంతో సదరు రైతుపై భౌతిక దాడికి దిగినట్లు తెలుసింది. బాధితుడు రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించాడు. ఈ తతంగమంతా చూస్తే ఫిల్టర్ ఇసుక మాఫియా ఏ స్థాయిలో ఉండి ప్రజాప్రతినిధులను, అధికారులను శాసిస్తుందో అర్థం చేసుకోవచ్చు.

నిఖిత కుటుంబానికి న్యాయం చేస్తాం

మన్ననూర్: అనుమానాస్పదంగా మృతిచెందిన చెప్పుకుంటున్న నిఖిత కుటుంబానికి న్యాయం చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. సోమవారం కలెక్టర్ ఉదయ్‌కుమార్‌తో కలిసి ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిఖిత మృతి పట్ల ఏ ఒక్కరో తీసుకునే నిర్ణయం కాదని, రీపోస్టుమర్టం వచ్చిన తర్వాతనే సంఘటన గురించి నిబంధనల ప్రకారం మాట్లాడాలని మౌనం వహిస్తున్నట్లు తెలిపారు. హత్య అని తేలితే దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించే వరకు ఉపేక్షించేది లేదన్నారు. ఒక దశలో ప్రభుత్వ ఉద్యోగులైతే రిమోల్ ఆన్‌ది సర్వీస్‌కు కూడా వెనుకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. బాధ్యత లేని కొందరు ఇష్టం వచ్చినట్లు అవాకులు, చివాకులు మాట్లాడుతున్నారని, ఒక కుటుంబం మానసింగా ఇబ్బందులకు గురవుతున్న క్రమంలో అవేవీ పట్టించుకోకుండా శవ రాజకీయాలు చేయడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. యురేనియం తవ్వకాల గురించి గురించి విలేకర్లు అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే స్పందిస్తూ సేవ్ నల్లమల అంటూ అసెంబ్లీలో నినాదం వినిపించిన విషయాన్ని గుర్తుచేశారు. రియల్ ఎస్టేట్ దందాలు చేస్తున్న కొందురు ఆడుతున్న నాటకాలే యురేనియం తవ్వకాలని విమర్శించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో అచ్చంపేట జెడ్పీటీసీ ధర్మానాయక్, ఆర్డీఓ పాండునాయక్, సర్పంచ్‌లు శ్రీరాం, శారద, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ సలేశ్వరం ఉత్సవాల్లో జరిగిన సంఘటనలు దురదృష్టకరమన్నారు.

'సాక్షి'కి అభినందనలు



మాట్లాడుతున్న నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

- భూపట్టాలు అందుకున్న దళిత లబ్ధిదారులు
- ఫలించిన ఏడేళ్ల ఎదురుచూపులు
- కలెక్టర్, పేట ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు

నారాయణపేట: భూ పట్టాలు అందుకున్న లబ్ధిదారులు 'సాక్షి'కి అభినందనలు తెలిపారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కిష్టాపూర్‌లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న మా సమస్యపై వరుస కథనాలు ప్రచురించి తమ కుటుంబాలకు బాసటగా నిలవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అలాగే ఇన్నాళ్లు తమకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కిష్టాపూర్‌లో 2015–16లో ప్రభుత్వం దళితులకు ఒక్కొక్కరికీ 3ఎకరాల చొప్పున 50మందికి 150 ఎకరాలు ఇచ్చింది. అయితే సర్వే చేసి హద్దులు చూపించాలని లబ్ధిదారులైన రైతులు ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగారు. దీన్ని గమనించిన 'సాక్షి' ఈ భూ వ్యవహారంపై 2020 అక్టోబర్ 24న 'సర్వే చేయరు.. హద్దులు చూపరు' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. స్పందించిన అధికార యంత్రాంగం సర్వేకు ఆదేశించింది. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల సర్వే చేయలేదు. దీంతో మరోసారి నవంబర్ 17న 'సర్వే ఇంకెన్నాళ్లు?' అంటూ కథనం ప్రచురితమైంది. దీనికి అప్పటి కలెక్టర్ దాసరి హరిచందన స్పందించారు. 150 ఎకరాలను సర్వే చేసేందుకు కమిటీని నియమించడంతో జిల్లా సర్వేయర్ల బృందం సర్వేకు చర్యలు చేపట్టింది. అంతటితో ఆపేయడంతో డిసెంబర్ 26న 'హద్దు లెక్కడ?'.. భూ పంపిణీ చేసినా సరిహద్దులు చూపని అధికారులు' అంటూ సాక్షిలో మరో కథనం ప్రచురితమైంది. దీనికి ప్రస్తుత కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి స్పందించారు. ఆ భూములపై సర్వే చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో జిల్లా సర్వేయర్ల బృందం, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి సర్వేను పూర్తి చేశారు. లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ 2.15 ఎకరాల భూమిని కేటాయిస్తూ పట్టాపాసుపుస్తకాలను సోమవారం ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతులమీదుగా అందజేశారు.

రుణపడి ఉంటాం



కిష్టాపూర్‌కు చెందిన లబ్ధిదారు జైదు నర్సమ్మ. ఆమె పేరిట మూడు ఎకరాల భూమిని ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయించింది. కానీ పట్టాపాసుపుస్తకం చేతికి అందకముందే మృతి చెందింది. మృతురాలికి భర్త జైదు మల్లేశ్, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఉండడానికి ఇళ్లు లేదు. పండించుకునేందుకు పొలం ఉన్నా లేనట్లే ఉంది. పట్టాపాసు పుస్తకం అందడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబానికి రైతుబంధు, రైతు బీమా కల్పించిన సీఎం కేసీఆర్‌కు ఎంతో రుణపడి ఉంటామని ఆనందం వ్యక్తంచేశారు.

– జైదు మల్లేశ్

సంతోషంగా ఉంది..



ప్రభుత్వం దళితులకు ఇచ్చిన మూడు ఎకరాల భూమి తమకు సర్వే చేసి 2.15 ఎకరాల పట్టా పాసు పుస్తకం ఇవ్వడం సంతోషంగా ఉంది. 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వరుస కథనాలతో మా సమస్య పరిష్కారం అయినందుకు వారికి ప్రత్యేక అభివందనాలు తెలియజేస్తున్నాం.

– విజయలక్ష్మి, లబ్ధిదారు

తల్లిదండ్రుల ఆత్మ శాంతిస్తుంది



దళితులకు మూడెకరాల భూమి పంపిణీలో మా తల్లి నాగరం వెంకటమ్మపై రిజిస్ట్రేషన్ అయ్యింది. భూ పట్టపాసుపుస్తకాలు రాకముందే తల్లి వెంకటమ్మతో పాటు తండ్రి హన్మంతు కన్నుమూశారు. ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి సహకారంతో నా పేరుపై 2.15 ఎకరాల భూమి పట్టపాసు పుస్తకం అందడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. మా తల్లిదండ్రుల ఆత్మ శాంతిస్తోందనిపిస్తుంది.

– నాగారం రాజు, లబ్ధిదారుడు

రెవెన్యూ, సర్వే అధికారులకు ప్రశంసలు

కలెక్టర్ శ్రీహర్ష ఆదేశాల మేరకు జిల్లా సర్వేయర్ అధికారి గిరిధర్, సర్వేయర్లు మల్లేశ్, కృష్ణయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రంగయ్య, ధన్వాడ తహసీల్దార్ నాగలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ గాయత్రి, గిర్దావర్ మల్లేశ్ సమన్వయంతో భూములను సర్వే చేసి తుది నివేదికలను సమర్పించారు. దీంతో కలెక్టర్ వారిని ప్రశంసిస్తూ సొంత లెటర్ ప్యాడ్‌పై అభినందన లేఖను అందించారు.



శాఖాపూర్‌లో విషాదం

- గద్వాల జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో యువకుడు మృతి
- కురుమూర్తి నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులు



కురుమూర్తియాదవ్ (ఫైల్)

అడ్డాకుల: గద్వాలలో ఉండే స్నేహితుడిని కలిసి రావడానికి వెళ్లిన ఇద్దరు స్నేహితులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ సంఘటన అడ్డాకుల మండలం శాఖాపూర్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన కురుమూర్తి యాదవ్(38) హైదరాబాద్‌లోని ఐఐఎఫ్‌ఎల్ గోల్డ్ లోన్ కంపెనీలో పెరిటరి మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య శైలజ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. అదే గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి(35) హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఏడాది క్రితం సవితతో వివాహం కాగా వీరికి రెండు నెలల పాప ఉంది. ఆదివారం గద్వాలలో ఉండే స్నేహితుడిని కలవడానికి కురుమూర్తి ద్విచక్రవాహనంపై ఇద్దరు కలిసి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రాత్రి 9 గంటలకు జమ్మిచేడ్ వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరిని గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించగా మోహన్‌రెడ్డి ఆస్పత్రిలోనే మృతిచెందడంతో మృతదేహాన్ని అక్కడి మార్చురీలోనే ఉంచారు. కాగా కురుమూర్తి యాదవ్‌ను మెరుగైన చికిత్స కోసం కర్నూలు తరలించి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు వదిలాడు. ఆయన మృతదేహాన్ని మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం చెందడంతో తీవ్ర విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు అందరిచేత కంటతడి పెట్టించాయి. సోమవారం గద్వాల ఆస్పత్రిలో మోహన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో కురుమూర్తి యాదవ్ మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత సాయంత్రం 4 గంటలకు ఇద్దరి మృతదేహాలను స్వగ్రామానికి తెచ్చి అంత్యక్రియలు జరిపించారు.

కురుమూర్తి నేత్రాలు 'సజీవం'

రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కురుమూర్తి యాదవ్ నేత్రాలను కుటుంబీకులు దానం చేశారు. ఆదివారం రాత్రి కురుమూర్తి మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా సోమవారం ఉదయం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి కురుమూర్తి నేత్రాలను ఆయన భార్య శైలజ తీరని దుఃఖాన్ని దిగమింగి పెద్ద మనసుతో దానం చేసి గొప్ప మనసు చాటుకుంది. కురుమూర్తి తనువు చాలించినా తన కళ్లతో మరో ఇద్దరికి ఈ లోకాన్ని చూసే భాగ్యం కలిగించారని బంధువులు తెలిపారు. కంటి ఆస్పత్రి సిబ్బంది కురుమూర్తి భార్యకు సర్టిఫికెట్ అందజేశారు.

ఆస్పత్రిలో నవజాత శిశువు మృతి



రోధిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు

వైద్యులు పుట్టినరోజు వేడుకలు చేసుకుంటూ పట్టించుకోలేదని ఆరోపణ

పాలమూరు: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం అయిన కొన్ని గంటల వ్యవధిలో నవజాత శిశువు మృతి చెందింది. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించి పట్టించుకోకపోవడం వల్లే శిశువు చనిపోయిందని కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళితే జడ్చర్ల మండలం కిష్టారం చెందిన రాజేశ్వరి మూడవ కాన్పు కోసం నాలుగు రోజుల కిందట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని గైనిక్ విభాగంలో చేరింది. ఆదివారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో రాజేశ్వరి మగ శిశువుకు జన్మనిచ్చింది. శిశువు పుట్టిన తర్వాత ఆరోగ్యం బాగాలేదని వెంటిలేటర్‌లో పెట్టారు. దీంతో సోమవారం ఉదయం శిశువు మృతి చెందింది. అయితే అదేరోజు రాత్రి స్థానికంగా విధులు నిర్వహించే వైద్యులు పుట్టిన రోజు వేడుకల్లో చేసుకుంటూ శిశువును పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే మృతి చెందాడని ఆరోపించారు. దీనిపై జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకిషన్‌ను వివరణ కోరగా ఆ శిశువుకు పుట్టుకతోనే ఊపిరి ఆడటం లేదనే సమస్య ఉండటం వల్లే వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. దీనిపై బాధిత కుటుంబ సభ్యులు కూడా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, వైద్యుల నిర్లక్ష్యం ఏమాత్రం లేదని చెప్పారు.

'ఉపాధి' నిధుల రికవరీకి నోటీసులు

గండేడ్: గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో 49 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 2019 నుంచి 2022 వరకు దాదాపు 3,500 పనులకు గాను రూ.30కోట్ల వరకు ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టారు. మూడేళ్లకు గాను గతేడాది మే నెలలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. అప్పట్లో ఫీల్డ్ అసిస్టెంట్లు విధుల్లో లేకపోవడంతో గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు. దీంతో సోషల్ ఆడిట్‌లో వారిని బాధ్యులను చేస్తూ రెండు మండలాల్లో పంచాయతీ కార్యదర్శులకు 46 నోటీసులు ఇచ్చారు. అక్రమాలకు కార్యదర్శులే బాధ్యులని, మంగళవారం కలెక్టర్ కార్యాలయానికి రావాలని కలెక్టర్ రవినాయక్ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ రూపేందర్ రెడ్డి, ఏపీఓ హరిశ్చంద్రుడు నోటీసులను సోమవారం కార్యదర్శులకు అందజేశారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి దాదాపు రూ.2లక్షల వరకు అక్రమాలు జరిగినట్లు నోటీసుల్లో వెల్లడించారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు లబోదిబోమంటున్నారు.

చెంచులకు మగువ లడ్డూల పంపిణీ



లడ్డు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ తదితరులు

మన్ననూర్: నల్లమల చెంచు పెంటల్లోని కుటుంబాలకు ఎన్‌ఐఎన్ సహకారంతో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం మగువ లడ్డూలు (ఇప్పపువ్వుతో తయారు చేసిన లడ్డులు) పంపిణీ చేసినట్లు సంస్థ చైర్మన్, డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, సెక్రటరీ రమేష్‌రెడ్డి తెలిపారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దత్తత తీసుకున్న అప్పాపూర్, భౌరాపూర్‌తో పాటు పుల్లాయిపల్లి చెంచు పెంటలను వైద్యాధికారులు సందర్శించారు. చెంచు మహిళలు, పురుషులు, కౌమార బాలికలు, చిన్నారులను వ్యాధులు, రక్తహీనత నుంచి దూరం చేసేందుకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పెంటలో వైద్య పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో అప్పాపూర్ సర్పంచ్ గురువయ్య, సొసైటీ వైస్ చైర్మన్ శ్రీధర్, సభ్యులు కృష్ణారావ్, అశోక్ ప్రసాద్, లోక్యానాయక్, డాక్టర్ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిని నిర్బంధించిన మహిళకు రిమాండ్

మరికల్: ఒక వ్యక్తిపై దాడి చేసి ఇంట్లో నిర్బంధించిన కేసులో ఓ మహిళను పోలీసులు సోమవారం రిమాండ్‌కు పంపారు. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఈనెల 4న ధన్వాడకు చెందిన నేరేటి కృష్ణయ్య, మరికల్ అశోక్‌నగర్‌లోని తన బంధువు ఇంటికి పాల్వ అనుషా ఇంటి ముందునుంచి నడుచుకుంటూ వెళ్తుండగా అతని పిలిచి ఫోన్ మాట్లాడాలని తీసుకుంది. ఫోన్ తీసుకొని ఇవ్వకుండా బెదిరించడం, అతని వద్ద డబ్బులు లాక్కొని అతన్ని ఇంట్లో వేసి తాళం వేసింది. దీంతో మరుసటి రోజు కిటికీ నుంచి తప్పించుకొని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, విచారణ జరిపి ఆ మహిళను అరెస్టు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించారు.



మహిళను రిమాండ్ తరలిస్తున్న మహిళా పోలీసులు

ఆటో బోల్తా: మహిళలకు గాయాలు



గాయపడిన మహిళలు

అలంపూర్ రూరల్ : అలంపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మాంటిస్సోరి పాఠశాల సమీపంలో ముందుగా వెళ్తున్న ఆటోను మరో ఆటో ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. అందులోని మహిళలు గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వీరిని మున్సిపల్ వైస్ చైర్మన్ శేకర్‌రెడ్డి, కౌన్సిలర్ సుదర్శన్‌గౌడ్ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ మహిందర్ తెలిపిన వివరాలు.. మనోపాడ్ మండలం చెన్నిపాడ్ గ్రామనికి చెందిన గంగరాజు ఉండవెళ్లి మండలం బస్వాపూర్ గ్రామనికి చెందిన మహిళా కూలీలను ఆటోలో తీసుకెళ్తుండగా తిరుగు ప్రయాణంలో శింగవరం–2 గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మద్దిలేటి వెనక నుంచి వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టాడు. ఆటో కిందపడటంతో మాధవి తలకు గాయమైంది. మరో ఇద్దరికి చిన్నపాటి గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహిందర్ తెలిపారు.

క్లుప్తంగా...

అంబేడ్కర్ వర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశానికి నోటిఫికేషన్

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2022–23 విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ అర్హత పరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇంగ్లిష్, హిందీ, ఎడ్యుకేషన్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఎ.వి.ఆర్.ఎస్.రెడ్డి తెలిపారు.

దీక్షకు అనుమతి కోసం హైకోర్టుకు వెళతాం: గట్టు



సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగులకు మద్దతుగా తలపెట్టిన దీక్షకు అనుమతి కోసం హైకోర్టును ఆశ్రయిస్తామని వైఎస్సార్‌టీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ (పీఏసీ) సభ్యుడు గట్టు రామచంద్రరావు తెలిపారు. ఇందిరా పార్క్ వద్ద నిరుద్యోగుల పక్షాన దీక్షను ఆపేది లేదన్నారు. సోమవారం లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌టీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ క్రమంలో పోలీస్ శాఖను కూడా కలుస్తామన్నారు. ఈ పోరాటంలో 'టీ–సేవ్' ద్వారా అన్ని వర్గాల వారిని కలుపుకుపోతామన్నారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో తలపెట్టిన దీక్షకు పోలీసులు చివరి వరకు అనుమతి పెండింగ్‌లో పెట్టి తర్వాత లేదని చెప్పారన్నారు. వైఎస్ షర్మిలకు భయపడి తమ గళాన్ని నొక్కి పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ ఆఫీస్‌కి రావడానికి కూడా అనుమతి అంటున్నారన్నారు. కాగా, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏ పార్టీలోకి వెళ్తారనేది ఆయన ఇష్టమని గట్టు రామచంద్రరావు అన్నారు. ఆయన వైఎస్సార్‌టీపీలోకి రావాలనుకుంటే గేట్లు తెరిచే ఉంటాయని స్పష్టం చేశారు.

మే 6 వరకు టీఎస్‌ఐసెట్ దరఖాస్తుకు గడువు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశ పరీక్షకు అపరాధ రుసుము లేకుండా మే 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని టీఎస్‌ఐసెట్ కన్వీనర్, కాకతీయ వర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్‌ఐసెట్‌ను మే 26, 27 తేదీల్లో నాలుగు సెషన్‌లలో నిర్వహించనున్నారు.

లీకేజీ ఎలా చేశారు? పేపర్లు ఎవరెవరికి అమ్మారు?

టీఎస్‌పీఎస్సీ కేసులో ఈడీ ప్రశ్నల వర్షం

- ప్రధాన నిందితులు ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డిలను ఐదుగంటలకు పైగా ప్రశ్నించిన ఈడీ అధికారులు
- ఆర్థిక లావాదేవీలపై ఆరా తీసిన నలుగురు అధికారుల బృందం
- నేడు మరోమారు ఇద్దరినీ ప్రశ్నించనున్న ఈడీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో ఈడీ దూకుడు పెంచింది. పేపర్ లీకేజీ నిందితులు, పేపర్లు కొనుగోలు చేసిన వారి మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీల మూలాలపై ఈడీ అధికారులు దృష్టి పెట్టారు. ఇప్పటికే సిట్ కేసు వివరాల ఆధారంగా ఈసీఐఆర్(ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) నమోదు చేసిన ఈడీ అధికారులు విచారణ ముమ్మరం చేశారు. కేసులో ప్రధాన నిందితులైన ప్రవీణ్‌కుమార్ , రాజశేఖర్‌రెడ్డిలను కోర్టు అనుమతితో సోమవారం నలుగురు సభ్యుల ఈడీ అధికారుల బృందం ప్రశ్నించింది. సోమవారం ఉదయం 11–45 గంటల సమయంలో ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్లు సుమిత్ గోయల్, దేవేందర్‌సింగ్‌ల నేతృత్వంలోని నలుగురు సభ్యుల బృందం చంచల్‌గూడ జైలుకు చేరుకుంది.

జైలు లోపలే వేర్వేరుగా విచారణ

జైలు లోపలే ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిలను వేర్వేరుగా ప్రశ్నించారు. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన ఈ దర్యాప్తులో ఇద్దరి తరఫు న్యాయవాదుల సమక్షంలోనే ఈడీ అధికారులు ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిల స్టేట్‌మెంట్లను రికార్డు చేసినట్టు తెలిసింది. తొలి రోజు విచారణలో ప్రధానంగా ఇద్దరి కుటుంబ నేపథ్యాలు. బ్యాంకు లావాదేవీలు, టీఎస్‌పీఎస్సీలో ఇతర అధికారులు, సిబ్బందితో పరిచయాలు, పేపర్ లీకేజీకి ఎలా పాల్పడ్డారు..అనంతరం ఎవరెవరితో పేపర్ విక్రయానికి సంబంధించి సంప్రదింపులు జరిపారు..అన్న అంశాలపై లోతుగా ఆరా తీసినట్టు తెలిసింది.

మధ్యవర్తులుగా ఎవరెవరున్నారు?

టీఎస్‌పీఎస్సీ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ నుంచి దొంగిలించిన పేపర్లు కొనుగోలుకు మధ్యవర్తులుగా ఎవరెవరు ఉన్నారు? వారితో ఎలా పరిచయం...? పేపర్ల కొనుగోలు చేసేందుకు ఎవరెవరు ఎలా సంప్రదించారన్న ప్రాథమిక అంశాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. వాస్తవానికి ఈ కేసులో ఆర్థిక అంశాలపైనే ఈడీ ఫోకస్ పెట్టినప్పటికీ, అందుకు ఎలా మార్గాలు ఏర్పడ్డాయన్నది సైతం ఈడీ అధికారులు కూలంకషంగా ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే ఈడీ అధికారులు టీఎస్‌పీఎస్సీ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ అధికారి శంకరమ్మ, మరో అధికారి సత్యనారాయణలను సైతం ఈ నెల 13న ప్రశ్నించిన విషయం తెలిసిందే. వారి నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా కూడా కొన్ని ప్రశ్నలు అడిగినట్టు తెలిసింది. మంగళవారం మరోమారు ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిలను ఈడీ అధికారులు ప్రశ్నించనున్నారు.

ప్రేమ పేరుతో మైనర్‌ను వేధిస్తున్నాడనే..

- నల్లగొండ జిల్లాలో యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- 9 మంది నిందితుల అరెస్ట్.. వారిలో ఇద్దరు మైనర్లు

నల్లగొండ క్రైం: ప్రేమ పేరుతో వేధిస్తున్నాడన్న కారణంతోనే నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం జి.అన్నారం గ్రామానికి చెందిన ఇరిగి నవీన్ అనే యువకుడిని బాలిక సోదరుడు తన బంధుమిత్రులతో కలసి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. హత్యలో పాల్గొన్న మొత్తం 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నారు. నిందితులను సోమవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టిన నల్లగొండ ఎస్పీ అపూర్వరావు కేసు వివరాలను వెల్లడించారు.

మందలించినా వినకపోవడంతో

త్రిపురారం మండలం అన్నారం గ్రామానికి చెందిన నవీన్ చదువు మధ్యలోనే ఆపేసి మిర్యాలగూడలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. తన గ్రామానికే చెందిన ఓ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక సోదరుడు మణిదీప్ నవీన్‌ను మందలించాడు. బాలిక కూడా తనను మర్చిపోవాలని చెప్పడంతో మనస్తాపం చెంది మార్చి 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఆస్పత్రిలో కోలుకున్నాక మళ్లీ బాలిక ఇంటి చుట్టూ తిరుగడం మొదలు పెట్టాడు. దీంతో బాలిక సోదరుడు మణిదీప్, అతని స్నేహితుడు శివప్రసాద్‌లు కలిసి ఇంటి వైపు వస్తే చంపుతామని బెదిరించారు. ఆ విషయాన్ని నవీన్ నిడమనూరు మండలం గుంటిపల్లికి చెందిన తన స్నేహితుడు ఈట అనిల్‌కుమార్‌కు చెప్పి సాయం కోరాడు. దీంతో ఈ నెల 9న అనిల్ మధ్యవర్తిగా మాట్లాడేందుకు గుంటిపల్లి గ్రామంలోని స్నేహితుడైన తిరుమల్ ఇంటి వద్దకు మణిదీప్, అతని స్నేహితుడు శివప్రసాద్‌లను పిలిచాడు. ఇదే అదునుగా నవీన్‌ను చంపాలనుకున్న మణిదీప్‌తో పాటు మరో 8 మంది బంధువులు మూడు బైకులపై తిరుమల్ ఇంటికి వెళ్లి కర్రలతో దాడి చేయగా ముగ్గురూ పారిపోయారు. 9 మందిలో ఒకరైన రామలింగం వెంట తెచ్చుకున్న కత్తితో నవీన్‌ను 11 సార్లు పొడవగా అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం నిందితులు తొలుత గుంటూరుకు పారిపోయారు. అయితే చేతిలో డబ్బుల్లేక తిరిగి గ్రామానికి చేరుకున్నారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. మృతుడు ఎస్సీ కావడంతో ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

పంచాయతీలకు అవార్డుల పంట

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, అధికారులు అందుకున్నారు.

4 కేటగిరీల్లో నాలుగు మొదటి ర్యాంకులు

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ విభాగంలో నాలుగు కేటగిరీల్లో నాలుగు గ్రామాలు మొదటి ర్యాంకులు సాధించగా, రెండు గ్రామాలు రెండో ర్యాంకులను, మరో రెండు గ్రామాలు మూడో ర్యాంకులను సాధించాయి. ఐదు నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలను తెలంగాణ కైవసం చేసుకుంది. అవార్డుల కార్యక్రమం అనంతరం మంత్రి ఎర్రబెల్లి తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ వల్ల జరుగుతున్న పల్లెప్రగతి కార్యక్రమం, అది సాధించిన ఫలితాలను వివరించారు. దేశంలో తెలంగాణ మాత్రమే కేంద్ర ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు సక్రమంగా అందజేస్తోందని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆలోచనా పథంలో పనిచేస్తూ, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, దేశానికి ఆదర్శంగా తెలంగాణను నిలపాలని అవార్డు గ్రహీతలకు సూచించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేయాలని మంత్రి ఎర్రబెల్లి కోరారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ :

1) **ఆరోగ్యకర పంచాయతీ:** గౌతంపూర్– 1వ ర్యాంకు (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)
2) **నీరు సమృద్ధిగా ఉన్న పంచాయతీ:** నెల్లుట్ల– 1వ ర్యాంకు(జనగాం జిల్లా)
3) **సామాజిక భద్రత పంచాయతీ:** కొంగట్‌పల్లి– 1వ ర్యాంకు (మహబూబ్‌నగర్ జిల్లా)
4) **మహిళలకు స్నేహపూర్వక పంచాయతీ:** అయిపూర్–1 వ ర్యాంకు (సూర్యాపేట జిల్లా)
5) **పేదరికంలేని మెరుగైన జీవనోపాధి పంచాయతీ:** మన్‌దొడ్డి– 2వ ర్యాంక్ (జోగుళాంబ గద్వాల్ జిల్లా)
6) **సుపరిపాలన పంచాయతీ:** చీమలదారి– 2వ ర్యాంక్ (వికారాబాద్ జిల్లా)
7) **పరిశుభ్ర పంచాయతీ :** సుల్తాన్‌పూర్–3వ ర్యాంకు (పెద్దపల్లి జిల్లా)
8) **స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు ఉన్న పంచాయతీ:** గంభీరావ్‌పేట– 3వ ర్యాంకు (రాజన్న సిరిసిల్ల జిల్లా)

నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తం పంచాయత్ సతత్ వికాస్ పురస్కారం...

బెస్ట్ బ్లాక్ పంచాయతీ: తిమ్మాపూర్(ఎల్ఎండీ)– 2వ ర్యాంకు (కరీంనగర్ జిల్లా)
బెస్ట్ డిస్ట్రిక్ట్ పంచాయతీ: ములుగు– 2వ ర్యాంకు
గ్రామ ఊర్జా స్వరాజ్ ప్రత్యేక పంచాయతీ అవార్డు : ముక్రా– 3వ ర్యాంకు (ఆదిలాబాద్ జిల్లా)
కార్బన్ న్యూట్రల్ ప్రత్యేక పంచాయతీ అవార్డు: కన్హా– 2వ ర్యాంకు (రంగారెడ్డి జిల్లా)
గ్రామ ఊర్జా స్వరాజ్ ప్రత్యేక పంచాయతీ అవార్డు : ఎర్రవెల్లికి ప్రత్యేక ప్రశంస (సిద్దిపేట జిల్లా)

తెలంగాణ స్ఫూర్తితో దేశమంతటా పల్లెల అభివృద్ధి: సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: పచ్చదనం, పరిశుభ్రత, ఇతర విభాగాల్లో తెలంగాణ పంచాయతీలు దేశంలోనే అత్యున్నత స్థాయిలో నిలవడం రాష్ట్రానికే గర్వకారణమని బీఆర్ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. పంచాయతీల అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం ప్రతి అంశంలోనూ అగ్రగామిగా నిలిచి, అత్యధిక అవార్డులు గెలుచుకున్న స్ఫూర్తితో దేశవ్యాప్తంగా పల్లెల అభివృద్ధికి తమ కృషి కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లితో పాటు అవార్డులు అందుకున్న ప్రజాప్రతినిధులను, అధికారులను సీఎం అభినందించారు. 'దేశవ్యాప్తంగా 2.5 లక్షల గ్రామపంచాయతీలు పోటీపడితే 46 గ్రామాలు అవార్డులు దక్కించుకున్నాయి. వాటిలో 13 అవార్డులు తెలంగాణకే వచ్చినయి. అంటే ప్రకటించిన మొత్తం జాతీయ అవార్డుల్లో 30% తెలంగాణ కైవసం చేసుకున్నది. ఈ 13 ర్యాంకుల్లోనూ 4 ఫస్టు ర్యాంకులు తెలంగాణకే రావడం గొప్ప విషయం' అని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు షురూ

450 కొనుగోలు కేంద్రాలే ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వరికోతలు మొదలై 20 రోజులు దాటినప్పటికీ, కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే విషయంలో తాత్సారం కొనసాగుతోంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 450 కొనుగోలు కేంద్రాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. నిజామాబాద్, కామారెడ్డి, సూర్యాపేట, నల్లగొండ , కరీంనగర్ వంటి కొన్ని జిల్లాల్లోనే ఈ సెంటర్లను ప్రారంభించారు. ఖమ్మం, పెద్దపల్లి తదితర జిల్లాల్లో చాలా చోట్ల సెంటర్ల కోసం రైతులు ఆందోళనలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. అయితే కోతలు పెరిగి ధాన్యం పెద్ద ఎత్తున అమ్మకానికి తీసుకొచ్చే పరిస్థితి ఉన్న చోటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం: గంగుల కమలాకర్ , పౌరసరఫరాల శాఖ మంత్రి

రాష్ట్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. కొన్ని పెద్ద గ్రామాల్లో రెండేసి కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తాం. రైతులు తమ గ్రామ పరిధిలోని కొనుగోలు కేంద్రానికే వెళ్లి పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవచ్చు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయడమే సెంటర్ల నిర్వాహకుల పని. మిల్లర్లతో రైతులకు ఎలాంటి సంబంధం ఉండదు. తరుగు, తేమ, నాణ్యత పేరుతో మిల్లర్లు రైతులను వేధిస్తే కఠినంగా వ్యవహరిస్తాం.

స్ట్రాంగ్‌రూమ్ తాళంచెవుల మాయంపై ఆరా

జగిత్యాల: జగిత్యాల జిల్లాలోని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓ స్ట్రాంగ్ రూమ్ తాళం చెవుల మాయంపై ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు విచారణ చేపట్టారు. స్ట్రాంగ్‌రూమ్‌లో ఎన్నికల సామగ్రిని ఎలా భద్రపర్చారు.. తాళంచెవులు ఎలా తప్పిపోయాయి.. అనే దానిపైనే సుదీర్ఘంగా విచారణ జరిపినట్లు తెలిసింది. 2018 ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం ఫలితాల్లో అక్రమాలు జరిగాయని అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అప్పట్లో హైకోర్టును ఆశ్రయించడంతో ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ తెరిచి 17ఏ, 17సీ డాక్యుమెంట్ కాపీలు, సీసీ ఫుటేజీలు, ఎన్నికల ప్రొసీడింగ్స్‌ను ఈ నెల 11న తమకు సమర్పించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. అయితే, మొత్తం మూడు స్ట్రాంగ్‌రూమ్‌లకుగాను రెండు తెరుచుకున్నాయి. కోర్టు అడిగిన 17ఏ, 17సీ వీడియో ఫుటేజీలు భద్రపర్చిన మూడోగది తాళంచెవులు లేవు. ఈ విషయంపై కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్ ఈ నెల 12న మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. తాళంచెవులు మాయం కావడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక అందజేయాలని చీఫ్ ఎలక్షన్ కమిషన్‌ను ఆదేశించింది.

ఇస్రోకు ఎంపికైన 'పేట' వాసి



నారాయణపేట రూరల్: ఇండియన్ స్పేస్ రీసర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో 6వ ర్యాంకు సాధించి ఉద్యోగాన్ని పొందాడు. పట్టణానికి చెందిన చీరల వ్యాపారి లంకాపురి బాబురావు కుమారుడు హరీష్ స్థానిక పాఠశాలలో 2015–16లో టెన్త్ పరీక్షలు రాశాడు. ఆ తర్వాత పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ ద్వారా మాసబ్‌ట్యాంకులో మెకానికల్ సబ్జెక్టులో డిప్లొమా, తర్వాత బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇస్రో నిర్వహించిన పరీక్షకు హాజరై ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా 6వ ర్యాంకు సాధించాడు. మే నెలలో బెంగుళూర్‌లో ఉద్యోగంలో చేరనున్నాడు. మేరకు సోమవారం పలువురు నాయకులు ఆయనను సన్మానించారు.

రామన్‌పాడుకు నీటి నిలిపివేత

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో సోమవారం నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేసారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 50 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

దేశ సంపద దోచిపెడుతున్న మోదీ



మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు నారాయణ

- ధరల పెరుగుదలకు కేంద్ర నిర్వాకమే కారణం
- ప్రజల్లో చైతన్యం కల్పించేందుకే ఇంటింటికి సీపీఐ
- పార్టీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు నారాయణ

తెలకపల్లి: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నమైందని, దేశ సంపదను కొల్లగొడుతూ అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు నారాయణ అన్నారు. బీజేపీ కో హఠావో, దేశ్‌కో బచావో, ఇంటింటికి సీపీఐ కార్యక్రమం సోమవారం తెలకపల్లిలో కొనసాగింది. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేశవులుగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నారాయణ మాట్లాడుతూ దేశంలో మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతూ దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో రూ.410 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ఇప్పుడు రూ.1,220 పెరిగిందని విమర్శించారు. రూ.లక్షల కోట్లు ఆదానీ, అంబానీలకు కట్టబెట్టి బ్యాంకుల్లో ఉన్న రుణాలు మాఫీ చేస్తున్నారని, రైతులకు మాత్రం రూ.లక్ష రుణమాఫీ చేయలేకపోతున్నారని దుయ్యబట్టారు. అదానీ గుజరాత్‌లో ఒక స్మగ్లర్ స్థాయి నుంచి నేడు ప్రపంచంలోనే మూడో ధనవంతుడిగా ఎదిగాడని, ఇదంతా మోదీ చలువతోనే సాధ్యమైందని చెప్పారు. మోదీకి 30 మంది దత్తత పుత్రులు ఉన్నారని, వారికే దేశ సంపదను దోచిపెడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రశ్నించే గొంతును నొక్కే ప్రయత్నం మోదీ ప్రభుత్వం చేస్తుందని, అందులో భాగంగానే రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు చేశారని ఆరోపించారు. దేశంలో ప్రశ్నించే వ్యక్తులందరినీ దేశ ద్రోహులుగా చిత్రీకరిస్తూ.. సీబీఐ, ఈడీలతో దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగానే ఢిల్లీ సీఎం క్రేజీవాల్‌పై కేసు నమోదు చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అలాగే సీఎం కేసీఆర్ చుట్టూ సంకెళ్లు బిగించే ప్రయత్నం జరుగుతుందని అన్నారు. గంజాయి సామ్రాజ్యానికి అదాని అధిపతి అని.. గుజరాత్‌లోని ముంద్రా పోర్టుపై దాడులు నిర్వహిస్తే ఆదాని బండారం బయటపడుతుందని చెప్పారు. పెళ్లి లేని తనకు ధనాశ లేదన్న ఆయన దత్తపుత్రుడిపై ప్రేమ ఎందుకని ప్రశ్నించారు.

హామీలను నెరవేర్చాలి..

నల్లమలలో యురేనియం తవ్వకాలకు కేంద్రం పూనుకుంటుందని, అదే జరిగితే సీపీఐ అడ్డుకుని పోరాటాలు చేస్తుందని నారాయణ హెచ్చరించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇప్పటి వరకు మాయమాటలతో కాలం వెళ్లదీస్తున్నారని, ఇప్పటికైనా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాల పేరుతో ఊరికో కోడి, ఇంటికో ఈక అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. బీజేపీ వ్యతిరేక శక్తులను కలుపుకొనే ఉద్దేశంతోనే ఇంటింటికి సీపీఐ అనే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి ఏమయ్యాయని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాకారుల బృందం ఆటపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆనంద్‌జీ, వార్ల వెంకటయ్య, చంద్రమౌళి, బాలమురళి, నాయకులు పరశురాములు, రవీందర్, ఆంజనేయులు, వెంకటస్వామి, శ్రీను, శంకర్‌గౌడ్, ఖాజ, కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం




మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

ఉప్పునుంతల: సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలిచినట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వెల్టూర్ స్టేజీ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాడని అన్నారు. రూ.26వేల కోట్లతో చెన్నకేశవ, ఉమామహేశ్వర రిజర్వాయర్లను సాధించి ఈ ప్రాంత బీడు భూములకు సాగునీరందించే విధంగా ఎంతగానో కృషిచేస్తున్నట్లు వెల్లడించారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే రెట్టింపు అభివృద్ధి సాధిస్తారని అన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ రాజకీయ జన్మనిచ్చి అన్నివిధాలా అండగా నిలబడిన అచ్చంపేట నియోజకవర్గ ప్రజల రుణం ఆశించిన అభివృద్ధి చేసి తీర్చుకుంటానని అన్నారు. పులిజాల వద్ద నిలిచిపోయిన కేఎల్ఐ కాల్వను ఉప్పునుంతల మండలంలోని పెనిమిళ్ల వరకు విస్తరించి సాగునీరందించేలా పనులు సాగుతున్నాయని తెలిపారు. మన్ననూర్ గురుకుల పాఠశాలలో మృతిచెందిన విద్యార్థిని నిఖిత మృతిపై ప్రతిపక్ష పార్టీలు శవ రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. పోస్టుమార్టం పూర్తి నివేదిక వచ్చిన తర్వాత చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి రెండు ఎకరాల భూమి, డబుల్‌బెడ్రూం ఇల్లు, దళితబంధు పథకం సహాయం అందించి ఆదుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం మండలంలోని తాడూరుకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రావు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న ప్రజాగాయకుడు గద్దర్

నారాయణపేట: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ అణగారిన వర్గాల ప్రజలకు కల్పించిన హక్కులు దక్కాలంటే బడుగులకు రాజ్యాధికారం రావాలని ప్రజా గాయకుడు గద్దర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా అంబేడ్కర్ జాతర నిర్వహించారు. స్థానిక భారంబావి నుంచి పురవీధుల గుండా అంబేడ్కర్ విగ్రహం వరకు భారీగా శోభాయాత్ర నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో గద్దర్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రాల్లో అగ్రవర్ణాల రాజ్యం కొనసాగినంత వరకు అణగారిన వారి బతుకులు మారవని అన్నారు. బడుగులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సాంప్రదాయం పోవాలంటే బడుగు, బలహీన వర్గాల ప్రజలు చైతన్యంతో రాజ్యాధికారం దక్కించుకోవాలని పిలుపునిచ్చారు. నారాయణపేట జిల్లాలో మొదటిసారిగా అంబేడ్కర్ జాతరను నిర్వహించినందుకు జాతర కమిటీని అభినందించారు. ప్రధానంగా బడుగుల హక్కులు సాధించేందుకు వారిని చైతన్య పరిచేందుకు దళిత, బీసీ, మైనార్టీలు ఏకమై కదంతొక్కాలన్నారు. అప్పుడే అంబేడ్కర్ కలలు నెరవేరుతాయని తెలిపారు. తన ఆటపాట, మాటలతో సభ ప్రాంగణానికి వచ్చిన వారిని గద్దర్ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కాశీం, మహేష్, సతీశ్, భీంరెడ్డి, జక్క గోపాల్, చంద్రశేఖర్, ఈశ్వరమ్మ, మాధవ్, చంటి పాల్గొన్నారు.

అవినీతి సర్కార్‌ను గద్దె దించాలి



కమిటీ జాబితాను అందజేస్తున్న డీకే అరుణ

గద్వాల: రాష్ట్రంలో అవినీతి సర్కార్‌ను గద్దెదించేందుకు ప్రజలు సిద్ధం కావాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పిలుపునిచ్చారు. సోమవారం బూత్ స్వశక్తికరణ్ అభియాన్ సమావేశాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీకి ఓటు ఎందుకు వేయాలో ప్రజలకు వివరించాలన్నారు. రాబోవు ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు బూత్ స్థాయి సభ్యుల పాత్ర కీలకమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం బూత్ స్వశక్తికరణ్ కమిటీ జాబితాను అందజేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రామాంజనేయులు, వెంకట్రాములు, సత్యం, కౌన్సిలర్ జయశ్రీ, అనిత, అనిల్, నాగేందర్, ఆనంద్, రామాంజీ, మోహన్ రెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీల సమస్యలు పరిష్కరించాలి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రాజుకుమార్

పెంట్లవెల్లి: ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజుకుమార్ అన్నారు. మహిళా మండల కార్యాలయం ఎదుట సోమవారం చేపట్టిన ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వీఓఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.26 వేల వేతనం ఇవ్వాలని, రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, వీఓఏలతో ఆన్‌లైన్ పనులు చేయించకూడదని, అర్హులైన వారికి టీసీలుగా పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నోసార్లు ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం లభించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఈశ్వర్, వీఓఏలు మురళి, భగవత్, ఆశన్న, మంతమ్మ తదితరులు పాల్గొన్నారు.